క్లుప్తంగా

భారీ అన్నసమారాధన



అన్నప్రసాదం వడ్డిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ద్వారకాతిరుమల: సుబ్బారాయుడి షష్ఠి వేడుకల ముగింపును పురస్కరించుకుని స్థానిక బ్రహ్మం గారి ఆశ్రమం వద్ద మంగళవారం భారీ అన్నస మారాధన ఏర్పాటుచేశారు. తొలుత ఉత్సవ కమిటీ సభ్యులు పుట్ట వద్ద సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. నివేదలను సమర్పించి, అన్నసమారాధనను ప్రారంభించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.2 లక్షల విరాళం



దాత లలితకుమారికి బాండ్ పత్రాన్ని అందిస్తున్న హయగ్రీవాచారి

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రాజమండ్రికి చెందిన ఆచంట లలితకుమారి రూ.1 లక్ష, హైదరాబాద్‌కు చెందిన వడ్లమూడి సరోజిని రూ.1,00,116 మంగళవారం విరాళం గా అందజేశారు. ఈ మేరకు నగదు ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ సూపరింటెండెంట్ హయగ్రీ వాచారి విరాళం బాండ్ పత్రాలను అందించారు. దాత కుటుంబాలకు స్వామివారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

శ్రీవారి వాకిలి స్వర్ణమయం తొలి దాత రఘురామ్



బంగారు పూతతో ఉన్న అంతరాలయ ద్వారం

ద్వారకాతిరుమల: శ్రీవారి వాకిలి స్వర్ణకాంతులీను తున్న వేళ తొలి దాత, రాష్ట్ర ఆక్వా కల్చర్ డెవలప్ మెంట్ అథారిటీ (అప్సడా) మాజీ వైస్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నేత వడ్డి రఘురామ్ భక్తుల ప్రశంసలు అందుకుంటున్నారు. గర్భాలయంలో కొలువైన స్వామివారి వద్ద పుట్టను, మకర తోరణాన్ని, ప్రధాన ద్వారాన్ని బంగారు మయం చేయాలని ఆలోచన వచ్చిన వెంటనే రఘురామ్ తనవంతుగా తొలి దాతగా ముందుకొచ్చారు. దీంతో స్వర్ణ తాపడానికి తొలి అడుగు పడింది. ఆ తరువాత మిగిలిన ద్వారాలను, అంతరాలయాన్ని జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్, బొమ్ములూరుకు చెందిన దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు బంగారు పూత (ఎలక్ట్రో గోల్డ్ ప్లేటింగ్) చేయించారు.

ఇన్నర్ వీల్ గోల్డ్ క్లబ్ ఏర్పాటు



ఇన్నర్ వీల్ గోల్డ్ క్లబ్ సభ్యులు

జంగారెడ్డిగూడెం: రోటరీ ఇన్నర్ వీల్ జంగారెడ్డిగూడెం గోల్డ్ క్లబ్‌ను ఏర్పాటుచేసినట్టు రోటరీక్లబ్ అసిస్టెంట్ గవర్నర్ దాకారపు కృష్ణ తెలిపారు. స్థానిక తన కార్యాలయంలో ఈ క్లబ్ తొలి సమావేశం మంగళవారం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలుగా నాగసూరి మాధురి, కార్యదర్శిగా పద్మజ్యోతి, కోశాధికారిగా ఆదిలక్ష్మి, మరో 14 మంది సభ్యులతో కార్యవర్గాన్ని ఏర్పాటు చేశామని కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా మాధురి మాట్లాడుతూ సభ్యులు సహకారంతో, రోటరీక్లబ్ సభ్యుల ప్రాద్బలంతో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో బండారు సత్యవతి, వహిదా, కొల్లేపర శైలజ, సువర్చలా, లక్ష్మీ, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి హనుమద్ వ్రత కల్యాణోత్సవాలు

కొయ్యలగూడెం: స్థానిక సరిపల్లి రోడ్డులోని శ్రీ సంజీవ ఆంజనేయ స్వామి హనుమద్ వ్రత కల్యాణోత్సవాలు ఈనెల 13 నుంచి 17 వరకు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా 13న కలసస్థాపన, 14న ఐదువేల తమలపాకులతో పూజ, ఆంజనేయ స్వామి హోమం 15, లక్ష అరటి పళ్లపూజ, 16న హనుమత్ కల్యాణం, 17న 108 మార్లు హనుమాన్ చాలీసా పారాయణం మధ్యాహ్నం నుంచి అన్న సమారాధన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

13 నుంచి సీపీఎం సభలు

కుక్కునూరు: బుట్టయిగూడెంలో డిసెంబర్ 13, 14, 15 తేదీల్లో నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బుయ్యన శ్రీను పిలుపునిచ్చారు. మంగళవారం సీపీఎం మండల కమిటీ సమావేశం వర్స వీరస్వామి అధ్యక్షతన సుందరయ్య భవనం ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు.

యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు

ప్రమాదపుటంచున గుర్వాయిగూడెం బ్రిడ్జి



గుర్వాయిగూడెం వద్ద ఎర్రకాలువ బ్రిడ్జి కింద ఇసుక తవ్వుతున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ఉచిత ఇసుక పేరుతో మండలంలో ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. జల్లేరు కాలువ, ఎర్ర కాలువల్లో ఇసుకను ట్రాక్టర్లపై తరలించేస్తున్నారు. ఇసుక తవ్వకునేందుకు నిర్దేశించిన ప్రాంతం అంటూ ఏదీ లేకపోవడంతో దళారులు ఇసుకను ఇష్టారీతిన తవ్వేస్తున్నారు. ముఖ్యంగా వాగులు, కాలువల్లో ప్రధాన కట్టడాలైన బ్రిడ్జి వంటి వాటికి నిర్ణీత ప్రాంతం వరకు ఇసుక తవ్వకూడదు. అలా జరిగితే సదరు కట్టడాల ఉనికికి ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. ఈ విషయం అధికారులు తెలిసినప్పటికీ చూసీ చూడనట్టు వ్యవహరిస్తుండంతో ఇసుక తవ్వకందారులు పేట్రేగిపోతున్నారు. గుంతలు గుతంలుగా తవ్వేసి రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఇసుకను తరలించేస్తున్నారు.

బ్రిడ్జి మనుగడకు ముప్పు

జంగారెడ్డిగూడెం – ఏలూరు రహదారిపై మండలంలోని గుర్వాయిగూడెం మద్ది క్షేత్రానికి ఆనుకుని ఉన్న ఎర్రకాలువపై వంతెన ఉంది. ఈ వంతెనపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఎంతో రద్దీగా ఉండే ఈ వంతెన కింద దళారులు ఇసుక తవ్వకాలు మొదలు పెట్టారు. బ్రిడ్జి దూరంగా చేపట్టాల్సిన తవ్వకాలు, బ్రిడ్జి పిల్లర్ల సమీపంలో తవ్వేస్తున్నారు. దీంతో పిల్లర్ల పటిష్టత దెబ్బతిని చివరకు బ్రిడ్జి మనుగడే ప్రశ్నార్థకమయ్యే పరిస్థితి ఏర్పడవచ్చు. అదే జరిగితే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్దేశిత ప్రాంతాల్లోనే ఇసుక తవ్వకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దళారుల ఇష్టారాజ్యం

ఉచిత ఇసుక పేరుతో దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పేరుకే ఉచిత ఇసుక దళారుల దందాతో సామాన్యుడికి భారంగానే పరిణమిస్తోంది. అయితే ఈ ఇసుక వంతెనలు, ప్రధాన కట్టడాల సమీపంలో చేపట్టడం సరికాదు. సదరు కట్టడాల పటిష్టత దెబ్బతిని చివరకు భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉంది. పథకాలు అమలు సరైన రీతిలో జరిగేలా అధికారులు పర్యవేక్షించాలి.

– సీహెచ్ రాజబాబు, జంగారెడ్డిగూడెం

పట్టించుకోని అధికారులు

గుర్వాయిగూడెం ఎర్రకాలువ వంతెన సమీపంలో తవ్వకాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారుల అలసత్వం దళారులకు వరం మారి ఒక విధానం అంటూ లేకుండా ఇసుకను తవ్వేస్తున్నారు. ముఖ్యంగా బ్రిడ్జి కింద ఇసుకను తోడేస్తుండటంతో బ్రిడ్జి పటిష్టత దెబ్బతింతోంది. అధికారుల పర్యవేక్షణలో ఇసుక తవ్వకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలి

– ఎస్ నాగేశ్వరరావు, జంగారెడ్డిగూడెం

భూ సర్వే పనుల పరిశీలన



సుందరగిరిపై భూ రికార్డులను పరిశీలిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తతటాలయమైన ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై కొలువైన లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి 30 ఎకరాల భూమి కేటాయించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. రెవెన్యూ అధికారులు భూ సర్వే పనులు చేపట్టారు. ఆలయం చుట్టూ ఉన్న భూమికి సరిహద్దులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులను మంగళవారం జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి పరిశీలించి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

వేడుకగా శ్రీపుష్ప యాగోత్సవం



సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మూలవిరాట్

ద్వారకాతిరుమల: శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు మంగళవారం విశేష కార్యక్రమాలతో ముగిశాయి. ఉదయం ఆలయంలో అర్చకులు స్వామివారి మూలవిరాట్ కు విశేష అభిషేకాలు చేశారు. సాయంత్రం శ్రీపుష్పయాగోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ పరిసరాలను సుగంధభరిత పుష్ప మాలికలు, మామిడి తోరణాలు, అరటిబోదెలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన వేదికపై కల్యాణ మూర్తులను ఉంచి ప్రత్యేక పుష్పాలంకారాలు చేసి, పూజలు చేశారు. పుష్పమాలికలతో అలంకరించిన ఉయ్యాలలో స్వామి, అమ్మవార్ల మూర్తులను ఉంచి పవళింపు సేవ అర్చకులు వేదమంత్రాలతో నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని దేవస్థానం అందించిన పసుపు, కుంకుమ, ప్రసాదాలను స్వీకరించారు.

వీరభద్రుడి సంబరం



వీరభద్రుడి సంబరం నిర్వహిస్తున్న దశ్యం

కొయ్యలగూడెం: స్థానిక తాడేపల్లిగూడెం రోడ్డులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద వీరభద్రుడి సంబరం ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ బ్రాహ్మణ సంక్షేమ సంఘం సభ్యులు శూలాలను ధరించి కాగడ దివిటీలను వెలిగించి నృత్యాలు చేశారు. మండలంలోని బయ్యనగూడెం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద మంగళవారం గ్రామస్తులు ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మద్దు బాలనాగేశ్వరరావు, జంగారెడ్డిగూడెంకు చెందిన వంకదారి రాజేష్‌ల సౌజన్యంతో భారీ ప్రసాద వితరణ చేశారు.

ముమ్మరంగా వరి, వేరుశనగ, పత్తి కోతలు



ఇప్పలపాడులో పత్తిపంటను పరిశీలిస్తున్న అధికారులు



వల్లంపట్లలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

బుట్టాయగూడెం: మండలంలో వరి, వేరుశనగ, పత్తి పంటల కోతల పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు తెలిపారు. అంతర్వేదిగూడెం, ఇప్పలపాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా పత్తి పంటలను ఏఓ పరిశీలించారు. రబీ సీజన్‌కు మొక్కజొన్న, పొగాకు, మినుము, పెసర్లు వంటి పంటలను రైతులు పండిస్తున్నట్టు ఏఓ చెప్పారు. రైతులకు పత్తి తీయడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఉదయభాను, రాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన

టి.నరసాపురం: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని వల్లంపట్ల గ్రామంలో ఈ పంట నమోదు, కౌలు రైతుల కార్డులు, ప్రధాన మంత్రి ఫస్ బీమా యోజన, ఉద్యాన శాఖలో పథకాలను డివిజినల్ వ్యవసాయ అధికారి నాగకుమార్, ఏఓ బి.సుమలత రైతులకు వివరించారు. ఫసల్ బీమో యోజనలో మొక్క పంటకు ఇన్సూరెన్స్ డిసెంబర్ 15లోగా చెల్లించాలన్నారు. సూక్ష్మ, బిందు సేద్యం ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సబ్సిడీ ద్వారా డ్రిప్ ఇస్తుందని తెలిపారు. జింక్, బోరాన్, మెగ్నీషియం రైతు సేవా కేంద్రాల ద్వారా అందుబాటులో ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు వి.నీలమణికంఠ, పశు సంవర్థక సహాయకులు యు.అశోక్‌తేజ, సొసైటీ మాజీ ప్రెసిడెంట్ పేరుబోయిన శ్రీనివాస్, చవల అప్పలరాజు, లింగుశెట్టి సత్యనారాయణ, పి.వేణు, పరసా శ్రీను, వి.అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

బాలల పండుగ పోస్టర్ విడుదల



బాలల పండుగ పోస్టర్ విడుదల చేసిన ఎంఈఓ వెంకట్రావు

ద్వారకాతిరుమల: మండలంలోని పంగిడిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలల పండుగ పోస్టర్‌ను ఎంఈఓ–2 పరసా వెంకట్రావు మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 24, 25 తేదీల్లో ఏలూరులోని వట్లూరు దగ్గర సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలలో హేలాపురి బాలోత్సవం (ఐదో బాలల పండుగ) నిర్వహించనున్నట్టు చెప్పారు. 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు సబ్ జూనియర్, జూనియర్, సీనియర్లకు విద్య, సాంస్కృతిక విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ పోటీలకు సిద్ధం కావాలని సూచించారు. తెలుగు పండిట్ మద్దాల పెద్దిరాజు మాట్లాడుతూ ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం కమిటీ ఈ ఏడాది మండలంలోని విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించినట్టు చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు తన సెల్ నెంబర్ 83092 13457లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.సురేష్, తెలుగు ఉపాధ్యాయుడు కె.రమేష్, పి.ప్రభాకరరావు, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కులను ఉల్లంఘిస్తే శిక్షార్హులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి మధుబాబు

చింతలపూడి : మానవ హక్కులను ఉల్లంఘిస్తే కఠిన శిక్షలకు బాధ్యులవుతారని జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ మధుబాబు హెచ్చరించారు. మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం చింతలపూడిలో మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మధుబాబు మాట్లాడుతూ జాతి, వర్ణ, లింగ, కుల, మత, రాజకీయ వివక్షలకు గురికాకుండా ఉండేలా ఐక్యరాజ్యసమితి 1948 డిసెంబర్ 10న మానవ హక్కులను ప్రకటించిందని తెలిపారు. మానవ హక్కులను గౌరవించడం, రక్షించడం ప్రతి ఒక్కరి నైతిక బాధ్యత అని గుర్తుచేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.నాగేశ్వరావు, ఎస్ అశోక్ బాబు, ఏఎస్సై కిషోర్ కుమార్, న్యాయవాదులు పి.డేవిడ్ రాజు, పి.శ్రీనివాస్, ఎం రాజ్ కుమార్, సోషల్ వర్కర్ ఎండీ అక్బర్ ఆలీ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

కళాశాల పొలిటికల్ సైన్స్, ఎన్ఎస్ఎస్ యూనిట్, యూత్ సర్వీసెస్ విభాగాల ఆధ్వర్యంలో మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు, సెట్వెల్ సీఈఓ కేఎస్ ప్రభాకర్‌రావు మాట్లాడారు. బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం ద్వార కల్పించిన మానవ హక్కుల గొప్పతనాన్ని వివరించారు.

హక్కులపై అవగాహన అవసరం

కామవరపుకోట: ప్రతి ఒక్కరికీ హక్కులపై అవగాహన అవసరమని స్థానిక ప్రభుత్వ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం మల్లేశ్వరరావు అన్నారు. మంగళవారం పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు హక్కులపై అవగాహన కలిప్పించారు. హక్కుల ప్రాధాన్యత, మహిళల హక్కులపై మల్లేశ్వరరావు మాట్లాడారు. అధ్యాపకులు ఎం ఉషారాణి, కె.ఇందిరా కుమారి, ధారావతు మల్లేష్, పి.ఏడుకొండలు, ఎం.విజయకృష్ణ, ఉమ పాల్గొన్నారు.

సారా స్వాధీనం, బెల్లపు ఊట ధ్వంసం



పామిలేరు నది గట్టుపై బెల్లం ఊటతో ఎక్సైజ్ పోలీసులు

బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డిగణపవరం సమీపంలోని నిర్వాసిత కాలనీ తూటికుంట గ్రామంలో 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆర్ సత్యవతి మంగళవారం తెలిపారు. తనిఖీల్లో సబ్ ఇన్‌స్పెక్టర్ జి.సునీల్‌కుమార్, పోలవరం స్టేషన్ సిబ్బంది పాల్గొన్నట్టు తెలిపారు.

బెల్లపు ఊట ధ్వంసం

కుక్కునూరు: మండలంలోని వేలేరు గ్రామంలో పామిలేరు నది గట్టున సారా తయారీకి సిద్ధం చేసిన 1000 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై ఎస్ఎన్ఎస్ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

కొండప్పకోట చెరువు వద్ద..

చింతలపూడి: మండలంలోని దేశవరం శివారు కొండప్ప కోట చెరువు వద్ద వెయ్యి లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి, 50 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు ఏలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వైవీఎస్ఎస్ ఫణి కుమార్ తెలిపారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

గోపిమూర్తి గెలుపుపై హర్షం



లింగపాలెంలో అధికారులకు స్వీట్లు అందిస్తున్న నాయకులు

లింగపాలెం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తి ఘన విజయంపై మండలంలోని యూటీఎఫ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో విద్యాశాఖ అధికారులు కంటా రామారావు, జంగం రవీంద్రకు, పాఠశాలల్లో స్వీట్లు పంచారు.

కొయ్యలగూడెంలో..

కొయ్యలగూడెం: గోపిమూర్తి విజయోత్స వేడుక స్థానిక ఉపాధ్యాయ భవనంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కేక్ కట్ చేశారు. గోపిమూర్తి విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఆకుమర్తి విక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.

చింతలపూడిలో..

చింతలపూడి : గోపిమూర్తి విజయంపై ఉపాధ్యాయ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లో యూటీఎఫ్ జిల్లా నాయకులు పురేటి శ్రీనివాసరావు, అప్పారావులు కేక్ కట్ చేసి ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

టి.నరసాపురంలో..

టి.నరసాపురం: గోపిమూర్తి విజయోత్సవ సభ స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో యూటీఎఫ్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎంవీ అప్పారావు మాట్లాడుతూ ఈ విజయం చిరస్మరణీయం అన్నారు.

జీజీహెచ్ గేటు వద్ద ఆటోలు పెడితే చర్యలు



డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ

ఏలూరు టౌన్: ఏలూరు జీజీహెచ్ ప్రధాన ద్వారం వద్ద ఆటోలు అడ్డులేకుండా క్రమ పద్ధతిలో పెట్టుకోవాలని డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ సూచించారు. మంగళవారం ఉదయం ఆయన ఆసుపత్రికి వచ్చారు. అత్యవసర విభాగం మెయిన్ గేటు వద్ద ఆటోలు అడ్డుగా ఉండడాన్ని గుర్తించి, ఆటో డ్రైవర్లను పిలిపించి హెచ్చరికలు జారీ చేశారు. అత్యవసరంగా వైద్యం కోసం వాహనాలతో వస్తూ ఉంటారని మెయిన్ గేటు వద్ద వాహనాలు అడ్డుపెడితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

లెమన్ మార్కెట్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

జంగారెడ్డిగూడెం: స్థానిక మార్కెట్ యార్డ్‌లోని శ్రీవెంకటేశ్వర లెమన్ మార్కెట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని (2024–25) మంగళవారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా చైతన్య కృష్ణ, అధ్యక్షుడిగా జగతం గంగరాజు, ఉపాధ్యక్షులుగా వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, పెనుమర్తి సురేస్, సుబ్రహ్మణ్యం, ముఖ్య సలహాదారుగా విజ్జు రమేష్, శ్రీనివాసరాజు, కార్యదర్శిగా దానం సురేష్, సుబ్రహ్మణ్యం, శేఖర్, కన్వీనర్‌గా తోట రవి, ట్రెజరర్‌గా మన్యం బ్రహ్మయ్య, యర్రా సత్యనారాయణ, సభ్యులుగా బాలకృష్ణ, జగ్గారావు, అజయ్, సతీష్‌లు ఎన్నికయ్యారు. వీరితో సీటీకేబుల్ ఎండీ పాలపర్తి శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేయించారు. పట్టణ ప్రముఖులు దల్లి రామంజనేయరెడ్డి, త్రిపుర సుందరి, ఉడా రామ్ గోపాల్, బవిరిశెట్టి తిలక్, మార్కెట్ యార్డ్ సెక్రటరీ బాషాలు శుభాకాంక్షలు తెలిపారు.

మద్ది అంజన్నను దర్శించుకున్న భక్తులు



స్వామి వారి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఆలయ అర్చకులు స్వామి వారికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. 108 ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారం ఒక రోజు ఆదాయం రూ.1,32,118 వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ ఆర్‌వీ చందన తెలిపారు. ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు పాల్గొన్నారు.

14 నుంచి ఏసీఎఫ్ సభలు

జంగారెడ్డిగూడెం: హైదరాబాద్‌లో డిసెంబర్ 14 15 తేదీల్లో నిర్వహించే అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య (ఏసీఎఫ్) 50 వసంతాల సభలను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు, కూలీ సంఘం జిల్లా కార్యదర్శి భాస్కర్ పిలుపునిచ్చారు. జంగారెడ్డిగూడెంలో మంగళవారం ఆహ్వాన సంఘం రూపొందించిన కరపత్రాన్ని స్థానిక ప్రియదర్శిని కళాశాలలో పార్టీ శ్రేణులు విడుదల చేశారు. భాస్కర్ మాట్లాడుతూ జార్జిరెడ్డి 2వ వర్ధంతి సందర్భంగా దివంగత జంపాల చౌరవతో అరుణోదయ సాంస్కృతిక వేదిక ఏర్పడిందన్నారు. హైదరాబాదులో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే ఈ సభల్లో కవులు, కళాకారులు, విద్యార్థి మేధావులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల బాబురావు, కామన్ సత్యనారాయణ, కొండ రాము, కాటయ్య నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా చెల్లించాలి

పెదపాడు: రబీలో అపరాలు సాగు చేసే రైతులు వెంటనే ఎకరాకు రూ.60 పంటల బీమా సొమ్ము చెల్లించాలని పెదపాడు మండల వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్ తెలిపారు. పెదపాడు మండలంలోని కొనిణి, నాయుడుగూడెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ పసుసంవర్ధక శాఖ మత్స్యశాఖ సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రం ద్వారా ధాన్యం విక్రయించే రైతులు ట్రక్ షీట్ జనరేట్ అయిన తరువాత ఎఫ్‌టీఓ వేలిముద్రలు వేస్తే ధాన్యం డబ్బులు త్వరితగతిన ఖాతాలో జమ అవుతాయని చెప్పారు. ఈకార్యక్రమంలో రైతులతో పాటు వ్యవసాయ అనుబంధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.